సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



చట్టాలపై అవగాహన అవసరం

మహిళల హక్కులు,చట్టాలపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి రమేష్ అన్నారు. 8లో



నేత్రపర్వంగా రథయాత్ర

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కనకమహా లక్ష్మి అమ్మవారి రథయాత్ర శనివారం వైభవంగా సాగింది. 8లో



శభాష్ నితీష్

సెంచరీతో అదరగొట్టిన నితీష్‌కుమార్ రెడ్డిపై ప్రశంసలు కురుస్తున్నాయి. విశాఖలో సంబరాలు అంబరాన్ని తాకాయి. 8లో

న్యూస్‌రీల్

ఉన్నత లక్ష్యాలు అవసరం

- కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమంలో దినేష్‌కుమార్



గిరిజన విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: విద్యార్థులు ఉన్నత స్థానాల్లో రాణించాలంటే లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం క్యాంప్ కార్యాలయంలో శ్రీకృష్ణాపురం ఆశ్రమ పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థినులు,దిగుమోదాపుట్టు ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత విద్య,ఉద్యోగ లక్ష్యాలను ఇప్పటి నుంచే నిర్మించుకోవాలని సూచించారు.టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.కెరీర్ గైడెన్స్‌పై అవగాహన ఏర్పర్చుకుని,మంచి ప్రణాళికలతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. సివిల్ సర్వీసెస్, ఏపీపీఎస్సీ పరీక్షలపై అవగాహన కల్పించారు. కేరీర్ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. గిరిజన విద్యార్థుల తల్లిదండ్రుల వృత్తులు,కుటుంబ నేపథ్యం,ఇతర పరిస్థితులను కలెక్టర్ పేరుపేరున అడిగి తెలుసుకున్నారు.

'సేంద్రియ' శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- చింతపల్లి ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి



చింతపల్లి: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో సేంద్రియ వ్యవసాయంపై శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి ఉన్నవారు జనవరి 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనవచ్చని చెప్పారు. 18నుంచి 30 సంవత్సరాల వయస్సు గల గ్రామీణ యువతీ యువకులు అర్హులు.ఈ శిక్షణకు హాజరైన వారికి ఉచిత భోజనం వసతి, రవాణా సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సేంద్రియ వ్యవసాయ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసున్నట్టు చెప్పారు. ఆసక్తి గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు పరిశోధనా స్థానం విస్తరణ విభాగం శాస్త్రవేత్త బాల హుస్సేన్ (ఫోన్ నంబర్లు 9390580342, 9848420373)ను సంప్రదించాలని తెలిపారు.

పంటల బీమా తప్పనిసరి




పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నందు, ఉద్యానవన శాఖ అధికారి రమేష్

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు, వరి, రాజ్‌మా తదితర పంటలకు తప్పనిసరిగా బీమాను చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నందు అన్నారు. తద్వారా పంటలు దెబ్బతిన్న సమయంలో పరిహారం పొందవచ్చని చెప్పారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమేష్, చింతపల్లి వ్యవసాయ శాఖ ఏడీ కంటా జాహ్నవి, వ్యవసాయాధికారి మధుసూదనరావులతో కూడిన బృందం శనివారం మండలంలోని పెదజడుమూరు, గూడెంపాతవీధి, పి.కొత్తూరు గ్రామాల్లో పర్యటించింది. అక్కడ గిరిజన రైతుల పొలాలకు వెళ్లి వరి, రాజ్‌మా పంటను పరిశీలించింది. ఈ సందర్భంగా నందు మాట్లాడుతూ రాజ్‌మా పంటకు ఈనెల31లోగా బీమా చేయించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

చలి@ 9.5 డిగ్రీలు

- జిల్లాలో ఒక్కసారిగా తగ్గిన ఉష్ణోగ్రతలు
- ఒక్క రోజులోనే 6 డిగ్రీల తగ్గుదల
- దట్టంగా కురుస్తున్న పొగమంచు
- అవస్థలు పడుతున్న జనం



తాజంగి రహదారిలో దట్టంగా కురుస్తున్న పొగమంచు



పాడేరు పాతబస్టాండ్‌లో చలిమంటలను ఆశ్రయించిన రగ్గుల వ్యాపారులు



పాడేరు పాతబస్టాండ్ అంబేడ్కర్ సెంటర్‌లో దట్టంగా కురుస్తున్న పొగమంచు



రాజుపాకలు ప్రాంతంలో మంచు

సాక్షి,పాడేరు/చింతపల్లి: జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. అల్పపీడన ప్రభావంతో ఇటీవల కాస్త తగ్గిన చలి.. మళ్లీ జూలు విదుల్చుతోంది. దీంతో చలిగాలులు తీవ్రంగా వీస్తున్నాయి. గత వారం రోజులుగా అల్పపీడన ప్రభావంతో కనిష్ట ఉష్ణోగ్రతలు 18వ తేదీ నుంచి 27 తేదీ వరకూ 18 డిగ్రీలు నుంచి 16డిగ్రీల మధ్య నమోదు కాగా, శనివారం ఉదయం ఒక్క సారిగా 6 డిగ్రీలు తగ్గడంతో చలిగాలులు విజృంభించాయి. చింతపల్లిలో 9.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణం విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మిగిలిన మండలాల్లోను ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. అరకులోయలో 9.6 డిగ్రీలు,పాడేరు 9.9, డుంబ్రిగుడ 10, జి.మాడుగుల 10, జీకే వీధి 10.3, హుకుంపేట 10.3,ముంచంగిపుట్టు 11.6,పెదబయలు 11.6,అనంతగిరి 14, కొయ్యూరులో 14.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

దట్టంగా పొగమంచు : మన్యంలో మళ్లీ పొగమంచు దట్టంగా కురుస్తోంది ఉదయం 9గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. వారపుసంతలు,వ్యవసాయ,ఇతర కూలిపనులకు వెళ్లే గిరిజనులు పొగమంచు,చలితీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్‌రోడ్లతో పాటు ప్రధాన రోడ్లలోను వాహన చోదకులు లైట్లు వేసే వాహనాలకు నడుపుతున్నారు.

సాయంత్రం నుంచి చలిగాలులు : మన్యంలో సాయంత్రం 4గంటల నుంచే చలిగాలులు విజృంభిస్తున్నాయి.కాఫీపండ్ల సేకరణకు వెళ్లే గిరిజన రైతులు చలినితట్టుకోలేక మధ్యాహ్నం 3గంటలకే గ్రామాలకు చేరుకుంటున్నారు. ఉన్నిదుస్తులతో పాటు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.రాత్రి సమయంలో ఎక్కడ చూసిన చలిమంటలు దర్శనమిస్తున్నాయి. ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాలను సందర్శించే పర్యాటకులు కూడా ఫైర్ క్యాంప్‌లను ఆశ్రయిస్తున్నారు.

ఆరు నెలల్లో 62 మంది విద్యార్థుల మృతి

- మరణాలపై నిర్లక్ష్యంగా ప్రభుత్వం
- పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు
- కొయ్యూరు గురుకుల పాఠశాల సందర్శన



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, పక్కన ఎంపీపీ, ఇతర నేతలు



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న జేఏసీ నేతలు

కొయ్యూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో వివిధ కారణాలతో జిల్లాలో 62 మంది విద్యార్థులు మరణించారని పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు మరణిస్తున్నారని చెప్పారు. స్థానిక గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. అక్కడ విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ సన్యాసినాయుడుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. పాఠశాలలకు విద్యార్థులను పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు.గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించగా, కూటమి ప్రభుత్వం దానికి భిన్నంగా వ్యవహరిస్తోందని చెప్పారు. గురుకుల పాఠశాలల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కారించాలని డిమాండ్ చేశారు. 40 రోజులుగా వారు ఆందోళనలు చేస్తుండడంతో విద్యార్థులు నష్టపోతున్నారని చెప్పారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించి, విధులకు హాజరయ్యేలన్నారు. ప్రతిరోజూ విద్యార్థులను ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, చింతపల్లి మాజీ ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి సుమర్ల సూరిబాబు, చీడిపాలెం సర్పంచ్ సోమన్నదొర, సీనియర్ నాయకులు రమణ,కృష్ణ, రాంబాబు, రామ్మూర్తి పడాల్ పాల్గొన్నారు.

ఏ మంత్రి స్పందించకపోవడం అన్యాయం

కొయ్యూరు: గిరిజన విద్యార్థుల మరణాలపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నుంచి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి వరకూ ఎవరూ స్పందించకపోవడం అన్యాయమని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజుబాబు ఆరోపించారు. కొయ్యూరు గురుకుల పాఠశాల విద్యార్థి మరణించినా కనీసం ఒక్క అధికారి కూడా ఇంత వరకు పాఠశాలను సందర్శించలేదని విమర్శించారు. ఆయన శనివారం గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆందోళన చేశారు. మరణించిన విద్యార్థి మనోజ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజుబాబు మాట్లాడుతూ మనోజ్ మృతిపై అనేక అనుమానాలున్నాయన్నారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు పాఠశాలలో ఉంటే విద్యార్థి మరణించే వాడు కాదన్నారు.ఉపాధ్యాయులు లేక విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపించి చదువుకు దూరం అవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ జిల్లా నాయకులు శ్యామల వరలక్ష్మి, పాడి లోవరాజు, మాకాడ బూర్గులయ్య, బి.వెంకటరావు, రామచంద్రుడు,ఆర్.పాల్,పద్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

కలెక్టర్ దినేష్ కుమార్



కేజీబీవీల్లో ఉద్యోగాలు పొందిన వారితో కలెక్టర్ దినేష్‌కుమార్, డీఈవో బ్రహ్మాజీరావు

సాక్షి,పాడేరు: ఉపాధ్యాయులు,బోధనేతర సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని, గిరిజన విద్యాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సూచించారు. జిల్లాలోని కేజీబీవీలకు ఎంపికైన 42మంది బోధన,బోధనేతర సిబ్బందికి తన క్యాంప్ కార్యాలయంలో శనివారం నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఉద్యోగాల్లో నియమితులైన వారంతా పనిచేసే గ్రామాల్లోనే నివాసం ఉండాలన్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు చదవడం,రాయడం కూడా రాదన్నారు. అన్ని పాఠశాలల్లో బేస్‌లైన్ పరీక్షల ద్వారా వెనుకబడిన విద్యార్థులను గుర్తించినట్టు చెప్పారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టిసారించి, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు.కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న మూడు ప్రిన్సిపాల్ పోస్టులను భర్తీ చేసినట్టు తెలిపారు. తెలుగు, ఇంగ్లిషు, గణితం, పీఎస్,ఎన్ఎస్,సోషల్ సబ్జెక్టులకు 20 మంది సీఆర్‌టీలను, ఇంగ్లిషు, గణితం, ఫిజిక్స్,కెమిస్ట్రీ,బోటనీ,జువాలజీ,సివిక్స్ సబ్జెక్టులకు 14 మంది అధ్యాపకులను, నలుగురు అకౌంటెంట్లు, ఒక వార్డెన్‌ను నియమించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో పి.బ్రహ్మాజీరావు,డీసీడీవో జి.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన చిరు ధాన్యాల వినియోగం

- జేడీ విజయభారతి



చిరు ధాన్యాలను కొనుగోలు చేస్తున్న పర్యాటకులు

అరకులోయటౌన్: చిరుధాన్యాల వినియోగం బాగా పెరిగిందని విజయవాడలోని వ్యవసాయ శాఖ జేడీ విజయ భారతి అన్నారు. అరకులోయ అందాలను తిలకించేందుకు శనివారం కుటుంబ సమేతంగా వచ్చిన ఆమె స్థానిక గిరిజన మ్యూజియంను సందర్శించారు. చిరుధాన్యాల విక్రయ కేంద్రం వద్ద పర్యాటకులతో పాటు ఆమె సామ,కొర్ర బియ్యం, రాజ్‌మా కొనుగోలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి రోజు ఆహారంలో చిరుధాన్యాలను తీసుకుంటున్నారని చెప్పారు.

ఆంధ్రా ఊటీ.. పర్యాటకులు పోటాపోటీ



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

అరకులోయటౌన్: ఆంధ్రా ఊటీ అరకులోయతో పాటు జిల్లాలో పలు పర్యాటక ప్రాంతాలకు శనివారం టూరిస్టులు పోటాపోటీగా తరలి వచ్చారు. గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం టూరిస్టులతో కళకళలాడాయి. గిరిజన మ్యూజియం అందాలను తిలకిస్తూ, గిరి మహిళల ప్రతిమల వద్ద ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. చిల్డ్రన్ పార్క్‌లో చిన్నారులు ఊయల ఊగుతూ కేరింతలు కొట్టారు. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో గాలికొండ వ్యూపాయింట్ వద్ద, అరకులోయ పట్టణంలో కొంత సేపు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు పోటెత్తారు. వీకెండ్ కావడంతో ఈ ప్రాంతానికి టూరిస్టు బస్సులు,కార్లు, జీపులు ఇతర వాహనాలపై వచ్చి సందడి చేశారు. పెద్దపెద్ద బండరాళ్లపై నుంచి పడుతున్న నీటి ప్రవాహంలో గంటల తరబడి కేరింతలతో ఉల్లాసంగా స్నానాలు చేశారు. రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.

డుంబ్రిగుడ: మండలంలోని చాపరాయి జలపాతం వద్ద శనివారం పర్యాటకులు సందడి చేశారు. తెలంగాణ రాష్ట్రం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దంపతులు చాపరాయిని సందర్శించి ఇక్కడ అందాలను తిలకించారు. జంగిడివలస వద్ద పొద్దుతిరుగుడు పువ్వుల తోటలో పర్యాటకులు ఫొటోలు తీసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు కొంతమంది పర్యాటకులు టెంట్లు ఏర్పాటు చేసుకుని సేద తీరారు.



అరకులోయలో గిరిజన మ్యూజియం ముఖద్వారం వద్ద పర్యాటకులు



చాపరాయి ముఖద్వారం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు



బోటు షికారు చేస్తున్న సందర్శకులు



పొద్దుతిరుగుడు పువ్వుల తోటలో పర్యాటకులు

మాట ఇచ్చి మోసం చేస్తారా

కూటమి ప్రభుత్వ తీరుపై వలంటీర్ల మండిపాటు

8లో

జిల్లాలోని పలు మండలాల్లో వలంటీర్లు ఆందోళనకు దిగారు. శనివారం భారీ ఎత్తున ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. జి.మాడుగులలో భిక్షాటన చేశారు. ఆరు నెలలుగా పోరాటాలు చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించడం లేదని, తమ బతుకులతో ఆడుకుంటోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పి, ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి ఆందోళనలకు పలు పార్టీలు మద్దతు తెలిపాయి.



జి. మాడుగులలో వలంటీర్ల భిక్షాటన



చింతపల్లిలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి చిన్నయ్య పడాల్, వలంటీర్లు



చింతూరులో ధర్నా చేస్తున్న వలంటీర్లు

క్లుప్తంగా

పేదల వైద్యానికి దాతల సహకారం అవసరం

- డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా



డీఎంహెచ్‌ంఓ జమాల్‌బాషా ఆధ్వర్యంలో ఆస్పత్రికి వైద్య పరికరాలు అందజేస్తున్న దాతలు

హుకుంపేట: స్వచ్ఛంద సంస్థలు మారుమూల గ్రామాల్లో పేదలకు మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి ఖరీదైన పరికరాలు అందించటం అభినందనీయం అని డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్ బాషా చెప్పారు. మండలంలో ఉప్ప ప్రభుత్వ ఆస్పత్రికి సమారిటన్స్ ఫర్ ద నేషన్ స్వచ్ఛంద సంస్థ (హైదరాబాద్) ఆధ్వర్యంలో రూ.2లక్షలు విలువైన హెల్త్ కేర్, మెడికల్ కేర్ సామగ్రిని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో వచ్చే వాతావరణ మార్పులతో గిరిజనులు, చిన్నారులు అనారోగ్యం బారిన పడితే వారికి ఉన్నత, మెరుగైన వైద్యం అందించేందుకు దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి మరన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రామ్‌కుమార్, రవిప్రసాద్, వైద్యాధికారి లేఖ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా జడ్జి రమేష్



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జీ రమేష్

పెదబయలు/దుంబ్రిగుడ: మహిళల హక్కులు,చట్టాలపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి ఎ.రమేష్ అన్నారు. పెదబయలు, దుంబ్రిగుడలలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా స్త్రీ,పురుషులకు సమాన హక్కులు, అవకాశాలను రాజ్యాంగం కల్పించినట్టు చెప్పారు.ముఖ్యంగా 33శాతం రిజర్వేషన్‌ను మహిళలు అందిపుచ్చుకోవాలన్నారు.గిరిజన ప్రాంతంలో బాల్య వివాహాలు జరగకుండా గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి, సారా నిర్మూలనకు మహిళలు కృషి చేయాలని చెప్పారు. అఘాయిత్యాలు, వేధింపుల నిరోధానికి పాటుపడాలని తెలిపారు.పెదబయలులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణయ్య,తహసీల్దార్ రంగారావు,లాయర్ ప్రసాదరావు,సీడీపీవో వరహాలమ్మ తదితరులు పాల్గొన్నారు. దుంబ్రిగుడలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎస్‌ఐ కె. పాపినాయుడు, లీగల్ సెల్ అరకులోయ లాయర్ మురళీపట్నాయిక్ పాల్గొన్నారు.



దుంబ్రిగుడలో మద్దతు తెలుపుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు



దుంబ్రిగుడలో వలంటీర్ల రిలే దీక్షలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ జానకమ్మ



జీకేవీధిలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ

మాట ఇచ్చి మోసం చేస్తారా

- తమను కొనసాగించాలని జిల్లా వ్యాప్తంగా వలంటీర్ల ఆందోళనలు
- భారీ ఎత్తున ర్యాలీలు, ధర్నాలు

పాడేరు: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వలంటీర్లు జిల్లా వ్యాప్తంగా శనివారం భారీ ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. తమను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామ వలంటీర్లు ఆందోళన చేశారు. స్థానిక ఐటీడీఏ పీవో కార్యాలయం నుంచి అంబేడ్కర్ జంక్షన్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో దేవిడ్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. గ్రామవలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించకపోతే దశల వారీగా ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. జిల్లా కార్యదర్శి కొండబాబు,మండల అధ్యక్షుడు సురేష్‌కుమార్, నాయకులు సత్యారావు, వాసు, సింహాచలం,రమణ, మౌనిక పాల్గొన్నారు.

చింతపల్లి: కూటమి ప్రభుత్వం వలంటీర్లకు న్యాయం చేసే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. చింతపల్లిలో శనివారం వలంటీర్లు మోకాళ్లపై నిలిచి నిరసన తెలిపారు. వారికి చిన్నయ్య సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పలు డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్, వలంటీర్లు సంఘం చింతపల్లి జీకే వీధీ,కొయ్యూరు మండలాల కన్వీనర్ వేములుపూడి పరమేష్ ,సంఘ నాయకులు విజయ్,సింహాచలం, కొండబాబు, బాలకృష్ణ , శిరీషా,రమ్య తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు.



పాడేరులో వినతిపత్రం ఇస్తున్న గ్రామ వలంటీర్లు

గూడెంకొత్తవీధిలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వలంటీర్లకు ఆయన సంఘీభావం తెలిపారు. రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని సందర్శించి, మాట్లాడారు. వలంటీర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో వలంటీర్ల సంఘం నాయకులు ముక్కలిగిరి, పాంగి కృష్ణ, మండల ఉపాధ్యక్షుడు బాలు, ఆనంద్, చంటి బాబు, బాస్కరరావు, అబ్బాయిదొర పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: గ్రామ వలంటీర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ డిమాండ్ చేశారు. దుంబ్రిగుడలో శనివారం నిర్వహించిన వలంటీర్ల రిలే దీక్ష శిబిరాన్ని సందర్శించి, మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా వలంటీర్ల గురించి పట్టించుకోలేదన్నారు. వలంటీర్ల సమస్యలను పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.బి. పోతురాజు అన్నారు.

మా పొట్టలు కొట్టొద్దు

జి.మాడుగుల: గ్రామ వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలం కేంద్రం జి.మాడుగులలో భిక్షాటన చేస్తూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు దీక్షా శిబిరం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కూటమి నేతలారా... మా పొట్టలు కొట్టవద్దంటూ.. నినాదాలు చేశారు. వలంటీర్ల యూనియన్ మండల అధ్యక్షుడు టి.శోభన్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పిస్తానని, నైపుణ్యం పెంచుతామని హామీ ఇచ్చిన చంద్రబాబు మోసం చేశారన్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి దీనబంధు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర,సీపీఎం నాయకుడు శంకరయ్య మద్దతు తెలిపారు. వలంటీర్ల యూనియన్ కార్యదర్శి చిన్నారావు, నాయకులు చంటిబాబు, కొండబాబు, వెంకట్ రఘురామాచారి పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు/హుకుంపేట: ముంచంగిపుట్టు, హుకుంపేట మండల కేంద్రాల్లో చేస్తున్న నిరాహార దీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ ఎన్నికల ముందు వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు పట్టించుకోవడం లేదని తెలిపారు. మా బతుకులను రోడ్డుపాలు చేయవద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ముంచంగిపుట్టు వారపు సంతలో సీఐటీయూ ఆధ్వర్యంలో వలంటీర్లు ప్లకార్డులు పట్టుకుని భారీ ర్యాలీ నిర్వహించారు.కూటమి ప్రభుత్వం స్పందించాలని నినాదాలు చేశారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ దీక్షలకు వైఎస్సార్‌సీపీ, సీపీఎం నేతలు, గిరిజన మహిళా సంఘం నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఎంపీడీవో శ్రీసాయిహర్షకు వినతిపత్రం అందజేశారు. హుకుంపేటలో వలంటీర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండబాబు,గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాపుల కృష్ణారావు మాట్లాడుతూ గ్రామ వలంటీర్ల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో టి.రమాదేవికు వినతిపత్రం అందజేశారు. హైమవతి, అప్పలకొండ, వలంటీర్లు లక్ష్మణ్, భవానీ శంకర్, వసంతకుమారి, శాంతికుమార్, తడిగిరి సర్పంచ్ రంజిత్ ,నాయకులు తిలక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి శంకర్‌రావు మాట్లాడుతూ వలంటీర్లకు ఎన్నికల ముందు రూ.10వేలు వేతనం అందిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తరువాత విస్మరించడం తగదన్నారు.తక్షణమే హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



హుకుంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామ వలంటీర్లు తదితరులు

ఉద్యోగభద్రత కల్పించాలి

చింతూరు: గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల అమలుకు కృషిచేసిన వలంటీర్లకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉద్యోగభద్రత కల్పించాలని వీఆర్‌పురం ఎంపీపీ కారం లక్ష్మి, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో చింతూరు, వీఆర్ పురం, కూనవరం, ఎటపాక మండలాలకు చెందిన వలంటీర్లు స్థానిక ఐటీడీఏ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం మూడో రోజు కొనసాగాయి. దీక్షలను ప్రారంభించిన వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు వలంటీర్లు ఉపాధి లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, బకాయి వేతనాలు చెల్లించి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఎన్నికలకు ముందు వలంటీర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని, వలంటీర్లకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని వారు ఐటీడీఏ అధికారులకు వినతిపత్రం అందచేశారు.



చింతూరులో ఐటీడీఏ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, వలంటీర్లు



ముంచంగిపుట్టు వారపు సంతలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, వైఎస్సార్‌సీపీ,సీపీఎం నేతలు, వలంటీర్లు

'పోలవరం'బాధితుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధితుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి రంపచోడవరం, చింతూరు డివిజన్ల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. చింతూరు డివిజన్ పరిధిలోని కూనవరం, చింతూరు, ఎటపాక, వి.ఆర్.పురం మండలాలకు సంబంధించి పోలవరం ముంపు బాధిత ప్రజలకు ల్యాండ్ టూ ల్యాండ్ పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న భూములను ఆయా రైతులకు చూపించాలన్నారు. దేవీపట్నం మండలంలో పోలవరం ప్రాజెక్ట్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కాలనీకి సంబంధించి శ్మశానవాటికల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో గిరిజనేతరులకు గోకవరంలో భూములు కేటాయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహచలం,సబ్‌కలెక్టర్ కల్పశ్రీ,ఆర్‌అండ్‌ఆర్ స్పెషల్ కలెక్టర్ సరళవందనం, చింతూరు ఎస్‌డీసీ అంబేద్కర్, ఈఈలు,ఏఈఈలు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

న్యాయం చేయాలని భూదాతల ఆందోళన

దుంబ్రిగుడ: ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూములు మేము ఇస్తే ఉపాధి అవకాశాలు వేరే మండలం వారికి కల్పించడం సరికాదని స్థానిక సొంతవలస గ్రామం భూవిరాళ దాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని నిర్మాణం జరుగుతున్న ఏకలవ్య పాఠశాలకు సంబంధించి భూమి దాతలు నిర్మాణం జరుగుతున్న పాఠశాల ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ 2015లో ఏకలవ్య పాఠశాల మండలంలోని మంజూరైంది. నిర్మాణానికి ప్రభుత్వ స్థలం లేక నాలుగు కుటుంబాలకు సంబంధించిన పట్టా భూములను నిర్మాణానికి అంగీకరిస్తే పాఠశాలలో ఉపాధి ఉద్యోగాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అప్పటి ఐటీడీఏ పీవో బాలాజీ స్థానిక ప్రజాప్రతినిధులతో రాతపూర్వకమైన ఒప్పందాలు చేసుకున్నట్టు తెలిపారు. అయితే పాఠశాల నిర్మాణం పూర్తి దశలో ఉండడంతో అరకులోయలో కొనసాగుతున్న ఏకలవ్య పాఠశాలను వచ్చే సంక్రాంతి నాటికి దుంబ్రిగుడ కేంద్రంలో పాఠశాలను తరలించే విషయాన్ని తెలుసుకొని శుక్రవారం పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి ఉపాధి అవకాశాల కోసం విన్నవించామన్నారు. పాఠశాలకు సంబంధించి ఎనిమిది మంది భూమి దాతలకు ఉపాధి అవకాశాలు ఇవ్వడం జరిగినట్టు వారు ప్రకటించడంతో ఒక్కసారిగా కంగుతిన్నామని భూవిరాళ దాతలు చెప్పారు. ఈ మేరకు మేరకు పాఠశాల నిర్మాణం జరుగుతున్న ప్రాంగణంలో ఆందోళన చేపట్టడం జరుగుతుందన్నారు. తక్షణమే కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ అధికార యంత్రాంగం స్పందించి భూమి దాతలైన తమ నాలుగు కుటుంబాలకు న్యాయం చేయాలని లేని పక్షంలో కుటుంబ సభ్యులతో ఏకలవ్య పాఠశాల ప్రాంగణంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఏకలవ్య పాఠశాల చైర్మన్ కామేశ్వరరావు, భవిత పొలిటికల్ చీఫ్ టి.రామదాసు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు టి.విశ్వనాథం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.పరశురాం, వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుసూదనరావు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న భూదాత బాధిత కుటుంబాలు

శభాష్ నితీష్

విశాఖ స్పోర్ట్స్/అక్కిరెడ్డిపాలెం: బాక్సింగ్ డే టెస్ట్‌లో సెంచరీతో అదరగొట్టి మెల్‌బోర్న్ హీరోగా మారిన నితీష్‌కుమార్ రెడ్డిపై ప్రశంసలు కురుస్తుండగా, విశాఖలో సంబరాలు అంబరాన్ని తాకాయి. ఈ మ్యాచ్‌లో నితీష్, ఒత్తిడిని తట్టుకుని చేసిన అసమాన పోరాటం చాలాకాలం గుర్తుండిపోతుందని పలువురు అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు. 8వ నంబర్ బ్యాటర్‌గా వచ్చి తొలి సెంచరీ చేయడంతో శనివారం జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలోని ఆయన నివాసం వద్ద సందడి వాతావరణం నెలకొంది. నితీష్ నాన్నమ్మ అప్పల కొండమ్మ, బాబాయిలు కాకి గోవిందరెడ్డి (కార్పొరేటర్), కాకి రామిరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు కేక్ కట్ చేశారు. ఇంటి వద్ద బాణసంచా కాల్చుతూ, తీన్‌మార్ డ్యాన్స్‌లతో సంబరాలు చేసుకున్నారు. భారత క్రికెట్ జట్టుకు తమ గ్రామానికి చెందిన నితీష్ ఆడుతుండటం తమకెంతో ఆనందంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం నితీష్ నివాసం ఉంటున్న కొమ్మాదిలోని అపార్ట్‌మెంట్ వద్ద కూడా కోలాహలం నెలకొంది. అపార్ట్‌మెంట్ వాసులు నితీష్ ఆటను పూర్తిగా ఆస్వాదించారు. అతను సెంచరీ చేసిన దృశ్యాలను టీవీల్లో వీక్షిస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ కమిటీ ప్రతినిధి వి.వి.రావు 'సాక్షి'తో మాట్లాడుతూ.. నితీష్ తక్కువ సమయంలోనే అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడని సంతోషం వ్యక్తం చేశారు. రెండేళ్ల కిందటే వారు అపార్ట్‌మెంట్‌లోకి వచ్చారని తెలిపారు.



తుంగ్లాంలో కేక్ కట్ చేస్తున్న క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి నాన్నమ్మ అప్పల కొండమ్మ తదితరులు

నితీష్‌కు కలెక్టర్ అభినందనలు

మహారాణిపేట(విశాఖ): మెల్‌బోర్న్‌లో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఉత్తమ ఆటతీరు కనబరిచిన యువ క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డిని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అభినందించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్న నితీశ్, ఆంధ్రప్రదేశ్‌కు, విశాఖపట్నానికి గర్వకారణమని కొనియాడారు. ఇదే ఒరవడి కొనసాగించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు నమోదు చేయాలని ఆకాంక్షించారు. తన ఆటతో విశాఖకు మంచి పేరు తీసుకొచ్చిన నితీశ్ కుమార్ రెడ్డికి జిల్లా యంత్రాంగం, ప్రజల తరపున అభినందనలు తెలుపుతున్నట్లు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు.

నేత్రపర్వంగా రథయాత్ర



దుర్గాదేవి నృత్యం రాక్షసుడ్ని వధిస్తూ

దాబాగార్డెన్స్(విశాఖ): కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కనక మహాలక్ష్మి అమ్మవారి రథయాత్ర శనివారం వైభవంగా సాగింది. అమ్మవారికి మాలధారణ చేసిన భక్తులు పూర్ణ కలశాలతో యాత్రలో పాల్గొన్నారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద సాయంత్రం 4 గంటలకు ఈ యాత్ర ప్రారంభమైంది. ఆలయ ఈవో కె.శోభారాణి, పలువురు ప్రముఖులు యాత్రను ప్రారంభించగా.. జగదాంబ జంక్షన్, టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎస్ కాలేజ్ డౌన్, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్‌రూమ్ మీదుగా అమ్మవారి దేవస్థానం వరకు సాగింది. విజయనగరం మహారాజ కళాశాల కళాకారుల పులివేషాలు, చెక్కభజన, కోలాటం, నవదుర్గల ప్రదర్శనలు రథయాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు ఈ కళా ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులు, మాలాధారణ చేసిన మాతలు, భక్తులతో ఈ ప్రాంతం కోలాహలంగా మారింది.



ఊరేగింపులో భక్తులు